# జొన్న

తెలంగాణ రాష్ట్రంలో మెట్ట వ్యవసాయంలో వర్షాధారంగా మరియు రబీలో ఆరుతడి పంటగా జొన్నను సుమారు ఒక లక్ష ఇరవై వేల హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేయడం జరుగుచున్నది. జొన్న పంటను రొట్టె కొరకు, పశుగ్రాసం మరియు కోళ్ళ దాణా కొరకు సాగు చేసుకోవచ్చును. ఈ పంటను మన రాష్ట్రంలో ప్రధానంగా మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, మెదక్ మరియు రంగారెడ్డి జిల్లాల్లో అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నప్పటికీ, మెట్ట ప్రాంతాల్లో లేదా తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రదేశాలలో వాతావరణంలోని మార్పులను తట్టుకొని కనీస దిగుబడినిచ్చేటటువంటి పంట.

**నేలలు :**

జొన్న పంట సాగుకు తేలికపాటి ఎర్ర చల్కా నేలలు మరియు తేమను నిలుపుకునే నల్లరేగడి నేలలు చాలా అనుకూలం. చౌడు నేలలు మరియు మురుగు నీరు నిల్వ ఉండే నేలల్లో ఈ పంట వేసుకోరాదు.

**విత్తే సమయము :**

ఖరీఫ్‌లో జొన్న పంటను (వర్షాధారంగా) జూన్ రెండవ పక్షం నుండి జూన్ 30 వరకు విత్తుకోవచ్చును. రబీలో అక్టోబరు రెండవ పక్షం లోపు విత్తుకుంటే పంట చివరి దశలో బెట్టకు గురికాకుండా ఉంటుంది. జొన్నను ఆలస్యంగా విత్తినపుడు మొవ్వు ఈగ తీవ్రంగా ఆశించి, మొక్కల సాంద్రత తగ్గి, తద్వారా దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి.

**అనువైన రకాలు :**

జొన్న పంట సాగు చేసేటపుడు తేమను నిలుపుకునే బరువైన నేలలు లేదా ఒకట్రెండు తడులు ఇచ్చే సదుపాయం ఉంటే హైబ్రిడ్‌లను ఎంచుకొని అధిక దిగుబడులు సాధించవచ్చును. తేలిక పాటి నేలల్లో అయితే సూటి రకాలను (అధిక చొప్పను మరియు గింజ నిచ్చే రకాలు) ఎంచుకోవడం శ్రేయస్కరం.

**రకాలు**

| రకము/హైబ్రిడ్ | పంట కాలము (రోజుల్లో) | దిగుబడి (క్వింటాళ్ళు/ఎకరానికి) | గుణగణాలు |
|---|---|---|---|
| **ఖరీఫ్‌కు అనువైన రకాలు మరియు హైబ్రిడ్‌లు :** | | | |
| పాలమూరు జొన్న | 105-110 | 13-15 | అధిక గింజ మరియు చొప్ప దిగుబడి నిచ్చే రకము. తెలుపు రంగు పెద్ద గింజలను కలిగి బూజు తెగులును తట్టుకుంటుంది. |
| సి.ఎస్.వి-15 | 110 | 12-14 | కంకులు వదులుగా ఉండటం వలన గింజ బూజు తెగులును తట్టుకుంటుంది. |
| సి.ఎస్.వి-27 | 115 | 11-12 | ఈ రకం బూజు తెగులు మరియు వర్షాభావ పరిస్థితులను తట్టుకుంటుంది. |

| రకము/హైబ్రిడ్ | పంట కాలము (రోజుల్లో) | దిగుబడి (క్వింటాళ్ళు/ఎకరానికి) | గుణగణాలు |
|---|---|---|---|
| సి.ఎస్.హెచ్-16 | 110 | 16-18 | పసుపు-తెలుపు రంగు గింజలను కలిగి మధ్యస్థ వదులుగా ఉన్న కంకి మరియు ఆకుమచ్చ గింజ బూజు తెగుళ్ళను తట్టుకుంటుంది. |
| సి.ఎస్.హెచ్-25 | 110-115 | 17-18 | ఈ హైబ్రిడ్ మొవ్వు ఈగ బారి నుండి తట్టు కుంటుంది. |
| సి.ఎస్.హెచ్-30 | 105 | 10-12 | వర్షాధార సాగుకు అనుకూలం. జొన్నను ఆశించే వివిధ కీటకాలు మరియు తెగుళ్ళను తట్టు కుంటుంది. |
| **రబీకి అనువైన రకాలు మరియు హైబ్రిడ్‌లు :** | | | |
| సి.ఎస్.వి.29 ఆర్ | 115-120 | 10-12 | రబీలో అధిక గింజ మరియు చొప్ప దిగుబడి నిచ్చే రకం. |
| సి.ఎస్.వి.216 ఆర్ | 110-115 | 12-14 | తెలుపు రంగు గింజలను కలిగి, అధిక గింజ దిగుబడి మరియు నాణ్యమైన చొప్పను ఇస్తుంది. |
| సి.ఎస్.హెచ్-13 | 105-110 | 16-18 | కంకులు మధ్యస్థ వదులుగా ఉండి అధిక దిగుబడిని ఇచ్చే హైబ్రిడ్. |
| సి.ఎస్.హెచ్-16 | 110 | 16-18 | వరి మాగాణుల్లో సాగుకు అనుకూలము. |

తెలంగాణలో మాఘీ జొన్న ప్రధానంగా ఖమ్మం మరియు నల్గొండ జిల్లాల్లో కొద్ది విస్తీర్ణంలో సాగు చేయబడుచున్నది. మాఘీలో కిన్నెర (ఎం.జె-276) రకం లేదా మహాలక్ష్మి హైబ్రిడ్‌లను ఎన్నుకొని సెప్టెంబరు 2వ పక్షంలోపు విత్తుకోవాలి.

**విత్తన మోతాదు :** ఎకరానికి 3-4 కిలోలు

**విత్తనశుద్ధి :** మొవ్వు ఈగ బారి నుండి పంటను రక్షించుకోవడానికి ఒక కిలో విత్తనానికి 3 గ్రా. థయోమిథాక్సామ్ 70% డబ్ల్యుఎస్ లేదా 12 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 48 ఎఫ్ఎస్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

**విత్తే దూరం :** ఎద్దుల సహాయంతో నడిచే గొర్రుతో వరుసల మధ్య 45 సెం.మీ. మరియు వరుసల్లో మొక్కల మధ్య 12-15 సెం.మీ. దూరంలో విత్తాలి. ఎకరాకు 60,000-74,000 మొక్కలు ఉండాలి.

**ఎరువులు :** ముందుగా ఎకరానికి 3-4 టన్నులు పశువుల ఎరువు వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. ఖరీఫ్‌లో వర్షాధారంగా సాగుచేసినప్పుడు ఎకరాకు 24 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం మరియు 8 కిలోల పొటాషియం ఇచ్చే ఎరువులను వేసుకోవాలి. రబీలో జొన్నను నీటిపారుదల క్రింద సాగు చేసినప్పుడు ఎకరాకు 40 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం మరియు 16 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులు వేయాలి. నత్రజని ఎరువులను సగభాగం విత్తేముందు, మిగతా సగం పైరు 30-35 రోజుల దశలో వేయాలి.

సస్యరక్షణ :

| పురుగు/తెగులు పేరు | గుర్తించే లక్షణం | అనుకూల పరిస్థితులు | నివారణ చర్యలు |
|---|---|---|---|
| మొవ్వు తొలుచు ఈగ | ఈ పురుగు ఆశించిన మొక్క మధ్యలోని మొవ్వు ఎండిపోయి చనిపోతుంది. మొవ్వును లాగినపుడు సులువుగా వచ్చి, కుళ్ళిపోయిన వాసన కలిగి ఉంటుంది. | జొన్న పంటను ఆలస్యంగా విత్తినపుడు లేదా విత్తిన వెంబడే వర్షాభావ పరిస్థితులు వస్తే ఈ పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. | • ఖరీఫ్‌లో జొన్నని జూలై 15 లోపు విత్తాలి.<br>• కిలోవిత్తనానికి థయోమిథాక్సామ్ 3 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 12 మి.లీ. తో విత్తనశుద్ధి చేయాలి.<br>• ఆలస్యంగా విత్తినపుడు కార్బరిల్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. |
| కాండం తొలుచు పురుగు | ఈ పురుగు ఆశించి నపుడు మొవ్వు చనిపోయి తెల్ల కంకి వస్తుంది. కాండాన్ని చీల్చి చూస్తే లార్వాలు మరియు ఎర్రటి కుళ్ళిపోయిన కణజాలం కనిపిస్తుంది. | ఈ పురుగు పంట 30 రోజుల దశ నుండి పంట కోసే దశ వరకు ఆశిస్తుంది. | విత్తిన 30-35 రోజుల దశలో ఎకరాకు 4 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను కాండము సుడులలో వేయాలి. |
| కంకి నల్లి | కంకిలో గింజలు నిండే దశ సమయాన ఈ పురుగులు రసం పీల్చడం వలన, గింజలు పూర్తిగా నిండకుండా నల్లగా మారతాయి. | ఆలస్యంగా విత్తినపుడు లేదా పైరు గింజ కట్టే దశలో ఎక్కువ రోజులు బెట్ట వస్తే ఈ పురుగు ఆశిస్తుంది. | ఎకరాకు కార్బరిల్ 5 శాతం 8 కిలోల పొడి మందును కంకుల మీద చల్లాలి. |
| గింజ బూజు తెగులు | గింజలపై నల్లని బూజు పెరుగుదల కనిపిస్తుంది. | పూత మరియు గింజ కట్టే దశలో అధిక వర్షాలు పడినపుడు ఈ తెగులు ఆశిస్తుంది. | తెగులు ఆశించే పరిస్థితుల్లో ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి గింజ ఏర్పడే దశలో పిచికారి చేయాలి. |
| బంక కారు తెగులు | తెగులు సోకిన కంకుల గింజల నుంచి తియ్యటి జిగురు వంటి ద్రవం కారు తుంది. | పంట ఆలస్యంగా విత్తినపుడు ఈ తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. | బెనోమిల్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి కంకులపై పిచికారి చేయాలి. |

**నీటి యాజమాన్యం :** జొన్న పంటకు సుమారుగా 450-600 మి.మీ. నీరు అవసరముంటుంది. సాధారణంగా ఖరీఫ్ జొన్నను వర్షాధారంగా సాగు చేస్తారు. అయితే వర్షాభావ పరిస్థితులు వస్తే పూత/గింజ కట్టే దశలో ఒక తడి ఇస్తే మంచి దిగుబడులు తీసుకోవచ్చును. రబీ జొన్నలో కూడ పూత మరియు గింజ పాలు పోసుకునే సమయంలో నీరు పెడితే గింజలు బాగా నిండి అధిక దిగుబడులు పొందవచ్చును.

**అంతర పంటలు :** ఖరీఫ్‌లో జొన్న : కంది 4:1 నిష్పత్తిలో వేసుకోవాలి.

**కలుపు నివారణ, అంతర కృషి :** కలుపును నివారించేందుకు అట్రజిన్ 50% పొడి మందుని ఎకరాకు 600 గ్రా. చొప్పున 200 లీ. నీటిలో కలిపి విత్తిన వెంటనే లేదా 2వ రోజు లోపు తడినేలపై పిచికారి చేయాలి. విత్తిన 30 రోజులకు గుంటక లేదా దంతితో వరుసల మధ్య అంతరకృషి చేయడం వలన పొలంలో తేమ నిలిచి మొక్కలు బాగా పెరుగుతాయి. విత్తిన రెండు వారాల లోపుగా ఒత్తుగా ఉన్న మొక్కలను తీసివేయాలి.

**పంటకోత :** కంకి క్రింది వరుసలో ఉన్న గింజలు ఆకుపచ్చ రంగు నుండి తెల్లగా మారి గింజలోనున్న పాలు ఎండిపోయి పిండిగా మారినపుడు మరియు గింజ క్రింది భాగాన నల్లటి చార ఏర్పడిన తర్వాత పంట కోయాలి. గింజల్లో తేమ 9-10 శాతం ఉండేలా ఎండబెట్టుకొని తర్వాత గోనె సంచుల్లో నింపాలి.

**విత్తనోత్పత్తి :** జొన్నలో రకాలు మరియు హైబ్రిడ్‌ల విత్తనోత్పత్తిని యాసంగిలో చేపట్టాలి. విత్తనోత్పత్తి చేసేటపుడు ఫౌండేషన్ విత్తనమైతే 400 మీ., సర్టిఫైడ్ విత్తనమైతే 200 మీ. వేర్పాటు దూరం పాటించాలి. హైబ్రిడ్ విత్తనోత్పత్తితో 4-6 వరుసల ఆడ మొక్కలు మరియు 2 వరుసల మగ మొక్కల నిష్పత్తిని పాటించాలి. జన్యు స్వచ్ఛతను సాధించుట కొరకు పూత దశకు ముందు, పూత దశలో మరియు పంట కోత సమయంలో బెరుకులను గుర్తించి వేరుచేయాలి.

**జొన్నలో అధిక దిగుబడులు సాధించుటకు ముఖ్య సూచనలు**

- ఖరీఫ్‌లో జొన్నను జూన్ 15 నుంచి జూలై 15 లోపు విత్తుకోవాలి.
- విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రా. థయోమిథాక్సామ్ లేదా 12 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్‌తో విత్తనశుద్ధి చేయాలి.
- ఖరీఫ్‌లో అధిక చొప్ప ఒక మోస్తరు గింజ దిగుబడినిచ్చే రకాలను, రబీలో అధిక గింజ దిగుబడినిచ్చే రకాలను ఎన్నుకోవాలి.
- పంట 30-35 రోజుల దశలో వత్తుగా ఉన్న మొక్కలను తీసివేసి ఎకరాకు 4 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను మొక్కల కాండం సుడులలో వేయాలి.
- గింజ బూజు తెగులు ఆశించే పరిస్థితులలో ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి కంకులపై పిచికారి చేయాలి.

**జొన్న సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన చిరునామా :**
**ప్రధాన శాస్త్రవేత్త (చిరుధాన్యాలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం.**
**ఫోన్ నెం. 8008404874**